# ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం

# రాజేంద్రనగర్, హైదరాబాద్ - 500 030, తెలంగాణ

## కేంద్ర విత్తన చట్టం ముసాయిదా - 2025 లో సవరించాల్సిన సెక్షన్లు మరియు అదనపు ప్రతిపాదనలు

రెండు దశాబ్దాలుగా తమ విత్తన సమస్యలకు మార్గం దొరుకుతుందని ఎంతో ఆశతో ఎదురు చూస్తున్న రైతాంగానికి కేంద్ర ప్రభుత్వం విత్తన చట్టం ముసాయిదా 2025 బిల్లును ఎట్టకేలకు ప్రజాభిప్రాయ సేకరణ కోసం వ్యవసాయ మంత్రిత్వశాఖ వెబ్‌సైట్‌లో పెట్టారు.

ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులకు అనుగుణంగా భారత ప్రభుత్వం నూతన విత్తన చట్టం ముసాయిదా - 2025ను ప్రతిపాదిస్తున్నట్లు తెలియజేయడం జరిగింది. ఈ ప్రతిపాదిత చట్టం ద్వారా విత్తనాలు మరియు నర్సరీ మొక్కల యొక్క నాణ్యతను నియంత్రించడం ప్రధాన ఉద్దేశ్యంగా పేర్కొన్నారు. అయితే ఈ చట్టంలోని వివిధ అంశాలను పరిశీలించినప్పుడు రైతాంగ ప్రయోజనాలను కాపాడే విధంగా లేదనే భావన వ్యక్తమవుతోంది. అంతే కాకుండా వ్యవసాయం మరియు రైతు సంక్షేమ బాధ్యత రాజ్యాంగ పరంగా పూర్తిగా రాష్ట్రాలది అయినందున ఈ చట్టం ద్వారా రాష్ట్రాల అధికారాలను మరియు హక్కులను హరించే విధంగా ఉందనే మరో అభిప్రాయం వెల్లువెత్తుతుంది. ఈ నేపథ్యంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో రైతు నాయకులు, అధికారులు, శాస్త్రవేత్తలతో ఈ చట్టంలోని వివిధ అంశాలపై మేధోమధనం చేసి తిరిగి రాష్ట్ర స్థాయిలో ఒక విస్తృత సంప్రదిపుల సమావేశంలో ఈ చట్టంలో పొందుపరచిన అంశాల వారీగా కూలంకశంగా నవంబర్ 28వ తేదీన విశ్వవిద్యాలయంలో చర్చించడం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ

శాఖ మంత్రితో పాటు వ్యవసాయ మరియు ఉద్యాన శాఖల ఉన్నతధికారులు, ఉమ్మడి రాష్ట్ర మాజీ వ్యవసాయ శాఖామాత్యులు శ్రీ వడ్డే శోభనాద్రీశ్వరరావు గారు, వివిధ రైతు సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల మరియు విత్తన పరిశ్రమ ప్రతినిధులు, శాస్త్రవేత్తలు పాల్గొని ఈ క్రింద పేర్కొన్న సవరణలు మరియు అదనపు ప్రతిపాదనలు పరిగణలోకి తీసుకోవలసినదిగా సిఫారసు చేశారు.

## నూతన విత్తన చట్టంలో ప్రతిపాదించిన సవరణలు మరియు సిఫార్సులు

1. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన విత్తన చట్టం ముసాయిదా-2025ను ఒక మోడల్ చట్టంగా తయారుచేసి వివిధ రాష్ట్రాలకు పంపినట్లైతే, ఆయా రాష్ట్రాలు వారి వారి స్థానిక పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేసుకొని రాష్ట్రాల వారీగా చట్టాలు చేసే అవకాశం కల్పించాలి.

2. ఒకవేళ కేంద్ర ప్రభుత్వం ఈ విత్తన చట్టం బిల్లునే తీసుకు రావాలనుకుంటే రాజ్యాంగ పరంగా రాష్ట్రాలకు సంక్రమించిన హక్కులను, అధికారాలను హరించకుండా ఉండాలి.

3. విత్తన చట్ట ముసాయిదా - 2025లోని

<u>సెక్షన్ 13 లో పొందుపరచిన నిబంధన:</u>

ప్రతి పంట విత్తన రకం రైతులకు అమ్మే ముందు తప్పనిసరిగా కేంద్ర విత్తన కమిటీ ద్వారా నమోదు (రిజిస్ట్రేషన్) చేసుకోవాలి.

<u>సిఫార్సు చేయబడిన సవరణ:</u>

ఒక రాష్ట్రంలో విత్తన రకాన్ని రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే కేంద్ర విత్తన కమిటీ ద్వారానే అనుమతి తీసుకోవాలి. కావున ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వానికి కూడా అధికారాలు ఉండేలా నిబంధనలను సవరించాలి.

4. <u>సెక్షన్ 16 (1)లో పొందుపరచిన నిబంధన:</u>

కొత్త రకం రిజిస్ట్రేషన్ పరిశీలించే విధానంలో ఆ రకం యొక్క దిగుబడి, ఇతర గుణగణాలు పరీక్షించడానికి కేంద్ర విత్తన కమిటీ ద్వారా ఐసిఏఆర్, రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం మరియు ఇతర సంస్థల ద్వారా పరిశీలించబడిన తర్వాత నిర్దేశించిన ప్రమాణాలను కలిగి ఉంటే మాత్రమే రిజిస్ట్రేషన్ చేయబడుతుంది.

<u>సిఫార్సు చేయబడిన సవరణ:</u>

రిజిస్ట్రేషన్ కోసం ఇతర సంస్థలు ప్రతిపాదించిన రకాలను, ఆ సంస్థలతో పాటు ICAR మరియు రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాలలో కనీసం ఒక పంటకాలం తప్పని సరిగా పరీక్షించాలనే నిబంధన ఉండాలి.

5. <u>సెక్షన్ 17 (3)లో పొందుపరచిన నిబంధన:</u>

ప్రతి విత్తన ఉత్పత్తిదారుడు మరియు విత్తన శుద్ధి కేంద్రం, సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా ప్రమాణాలు పాటిస్తేనే రిజిస్ట్రేషన్ చేయబడి విత్తన ఉత్పత్తికి మరియు అమ్మకానికి అర్హత ఉంటుంది.

<u>సిఫార్సు చేయబడిన సవరణ:</u>

ప్రతి విత్తనోత్పత్తిదారుడు రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే తప్పనిసరిగా బి.ఎస్.సి (వ్యవసాయం) లేదా డిప్లొమా (వ్యవసాయం) లేదా విత్తనోత్పత్తిపై ప్రభుత్వ రంగ సంస్థ ద్వారా సర్టిఫికేట్ కోర్సు చేయడం ఒక అర్హతగా నిర్దేశించాలి.

6. <u>సెక్షన్ 18 (1)లో పొందుపరచిన నిబంధన:</u>

విత్తన డీలరు మరియు డిస్ట్రిబ్యూటర్ కూడా నియమనిబంధనలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటేనే విత్తనాల విక్రయం చేపట్టాలి.

<u>సిఫార్సు చేయబడిన సవరణ:</u>

విత్తన డీలర్లు మరియు డిస్ట్రిబ్యూటర్లు విత్తనాలను విక్రయించాలంటే కనీసం బి.ఎస్.సి (వ్యవసాయం) లేదా డిప్లొమా (వ్యవసాయం) లేదా విత్తనోత్పత్తిపై ప్రభుత్వ రంగ సంస్థ ద్వారా సర్టిఫికేట్ కోర్సు చేయడం ఒక అర్హతగా నిర్దేశించాలి.

7. <u>సెక్షన్ 21 (1డి)లో పొందుపరచిన నిబంధన:</u>

ఏదైనా ఒక రకం విత్తనాలను అమ్మే ముందు ఆ రకం నమోదు (రిజిస్ట్రేషన్) కాబడి, భారత విత్తన ధృవీకరణ గుణగణాలు కలిగి, విత్తన సంచి పై ఆ రకం యొక్క పూర్తి సమాచారం మరియు కేంద్ర ప్రభుత్వ అనుసరణ పోర్టల్ నుంచి పొందిన **క్యూఆర్‌కోడ్** ద్వారా పొందు పరచాలి.

క్యూఆర్ కోడ్‌లో విత్తన ధృవీకరణ సంస్థ పత్రం లేదా స్వీయ ధృవీకరణ సమాచారం పొందుపరిచినప్పుడు మాత్రమే విత్తనాలు విక్రయానికి అర్హత కలిగి ఉంటాయి.

<u>సిఫార్సు చేయబడిన సవరణ:</u>

అన్ని రకాల విత్తనాలను రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేస్తున్నప్పటికీ గత విత్తన చట్టం మాదిరిగానే స్వీయ ధృవీకరణకు కూడా అనుమతి ఉంది. ఈ కారణం చేతనే నకిలీ మరియు నాసిరకం విత్తనాలు రైతులకు చేరడం తద్వారా నష్టం జరుగుచున్నది. కావున అన్ని రకాల విత్తనాలను రైతులకు విక్రయించే ముందు ఆయా పంటల విత్తనాలను తప్పనిసరిగా ఏదైనా ప్రభుత్వ రంగ సంస్థ (<u>విత్తన ధృవీకరణ సంస్థ / ఐసిఎఆర్ / రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం)</u> పరీక్షించేలా నిబంధన చేర్చి, **తప్పని సరిగా సర్టిఫికేషన్ చేసేలా నిబంధనలను పొందుపరచాలి.**

8. <u>సెక్షన్ 22:</u>

ఏదైనా ఒక పంట రకం యొక్క విత్తనాల ధరలు అసాధారణంగా పెంచడం గాని అధిక లాభార్జన కోసం కృత్రిమ కొరత సృష్టించడం గాని చేస్తే కేంద్ర ప్రభుత్వం అలాంటి ఆపత్కర పరిస్థితిలో జోక్యం చేసుకొని చర్యలు చేపట్టే అధికారం ఉంది.

<u>సిఫార్సు చేయబడిన సవరణ:</u>

అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే విత్తన ధరలను నియంత్రించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉంది. అయితే విత్తన ధరల్లో హెచ్చుతగ్గులు ప్రతి ఏటా రైతులను ప్రభావితం చేస్తాయి. కావున రైతాంగం అవసరాల మేరకు మరియు పరిస్థితులకు అనుగుణంగా విత్తన సరఫరా మరియు ధరల నియంత్రణ పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానికి అధికారాలు ఉండే విధంగా సవరణ అవసరం.

9. <u>సెక్షన్ 33 (సి)లో పొందుపరచిన నిబంధన:</u>

ఇతర దేశాల నుంచి విత్తనాలు దిగుమతి చేసుకోవడానికి సంబంధిత దేశంలో ధృవీకరింపబడిన మరియు క్షేత్ర పరీక్షల వివరాలు పొందుపరిస్తే ఆ విత్తనాలను దిగుమతి చేసుకేనే అవకాశం పొందుపరచడమైనది.

<u>సిఫార్సు చేయబడిన సవరణ:</u>

ఇతర దేశాలలో చేపట్టిన క్షేత్ర పరీక్షలు మరియు సర్టిఫికేషన్ ఆధారంగా మన దేశంలో ఒక రకం యొక్క విత్తనాలు దిగుమతి అయినప్పుడు ఆ రకం మన దేశ పరిస్థితులకు అనుకూలం కానప్పుడు రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. కావున ఇతర దేశాల నుంచి విత్తనాలు దిగుమతి అయిన తర్వాత ఎక్కడైతే ఆ విత్తనాలు మార్కెట్ చేయబడతాయో రైతులకు విక్రయించే ముందు ఆయా విత్తనాలను ఆ ప్రాంతంలో కనీసం రెండు సంవత్సరాలు (ICAR) లేదా (SAU) లలో పరీక్షింపబడేలా చట్ట సవరణలు చేపట్టాలి.

10. <u>సెక్షన్ 34లో పొందుపరచిన నిబంధన:</u>

విత్తన రకాలు నమోదు చేయకుండా, నాణ్యత లోపం మరియు నాసిరకం విత్తనాలను అమ్మితే రూ.50వేల నుంచి రూ.30 లక్షల వరకు జరిమానా విధించడంతో పాటు మూడేళ్ళ జైలు శిక్ష విధించేలా చట్టంలో నిబంధనలను పొందుపరచడం జరిగింది.

<u>సిఫార్సు చేయబడిన సవరణ:</u>

లైసెన్స్ రద్దు చేస్తూ, సంబంధిత ఉత్పత్తి మరియు విక్రయదారుడు ఎలాంటి విత్తనోత్పత్తి మరియు విక్రయాలు చేయకుండా కనీసం 5 సంవత్సరాలు నిషేధించాలనే నిబంధనను ఈ సెక్షన్‌లో పొందుపరచాలి.

## కేంద్ర విత్తన చట్టం ముసాయిదాలో అదనంగా పొందుపరచాల్సిన సెక్షన్లు

**11. నకిలీ లేదా నాసిరకం విత్తనాల వల్ల రైతులకు పరిహారం కల్పించే ప్రత్యేక నిబంధన:**

నాసిరకం విత్తనాల వల్ల నష్టపోయే రైతులకు పరిహారం అందించే వ్యవస్థ ఈ చట్టంలో ఎక్కడా పొందు పరచలేదు. గత రెండు దశాబ్దాలుగా రైతాంగం విత్తన చట్టం గురించి ప్రధానంగా ఎదురుచూస్తున్నది. నకిలీ విత్తనాల ద్వారా నష్టపోయినప్పుడు పరిహారం చెల్లించే చట్టం ఉండాలి, కానీ అలాంటి సదుపాయం ఈ చట్టంలో పూర్తిగా లోపించింది. **కావున ఈ చట్టంలో ఒక అదనపు సెక్షన్‌ను జోడించి నకిలీ విత్తనాల ద్వారా నష్టం వచ్చినప్పుడు ఆయా పంటలలో గరిష్టంగా వచ్చే దిగుబడికి సమానంగా నష్ట పరిహారం 60 రోజులలో చెల్లించే విధంగా స్పష్టమైన నిబంధన ఈ చట్టంలో చేర్చాలి.**

**12. విత్తన ఉత్పత్తి చేసే రైతుల కోసం ప్రత్యేక నిబంధన:**

విత్తన ఉత్పత్తి అత్యంత నైపుణ్యంతో కూడిన పని. ఇందులో ఎక్కువ సాగు ఖర్చు మరియు కఠినమైన నాణ్యత ప్రమాణాలు ఉంటాయి. కానీ కేంద్రప్రభుత్వం ప్రతిపాదించిన విత్తన చట్టం ముసాయిదా - 2025 లో విత్తన ఉత్పత్తి రైతాంగానికి సంబంధించి ఎలాంటి సెక్షన్లు లేకపోవడం దురదృష్టకరం. **కావున విత్తన ఉత్పత్తిలో పాల్గొనే రైతులకు చట్టపరమైన రక్షణ ఉండేలా ప్రత్యేక నిబంధనలను ఏర్పరచాలి.**

కావున

ఎ) **విత్తనోత్పత్తి చేసే రైతులు, విత్తన కంపెనీ మరియు వ్యవసాయ శాఖల మధ్య త్రిముఖ ఒప్పందం ఉండాలి.**

బి) **విత్తనోత్పత్తి చేసే రైతులకు కంపెనీ ద్వారా ఆ పంటకు భీమా సౌకర్యంతో పాటు విత్తన రైతుకు కూడా జీవిత భీమా కల్పించాలి.**

సి) **విత్తన రైతాంగానికి మరియు విత్తన కంపెనీకి సమస్యగా తయారైన మధ్యదారీ వ్యవస్థ (ఆర్గనైజర్ వ్యవస్థ) ను పూర్తిగా నిషేధించాలి.**

డి) **విత్తన రైతు ద్వారా వచ్చిన విత్తన దిగుబడిని విత్తన కంపెనీలు అంగీకరించిన ధరతో పూర్తిగా కొనుగోలు చేయాలి.**

13. <u>విత్తన కంపెనీలకు లైసెన్స్ జారీ చేసే విధానం పై ప్రత్యేక నిబంధన:</u>

- లైసెన్స్ ఇచ్చే కమిటీలో తప్పనిసరిగా <u>భారత వ్యవసాయ పరిశోధనా మండలి</u> (ICAR) లేదా సంబంధిత రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తను నియమించాలి.
- విత్తన కంపెనీల ఏర్పాటు లైసెన్స్ కొరకు తప్పనిసరిగా ఒక పరిశోధన విభాగం మరియు 5-10 ఎకరాల పరిశోధన క్షేత్రం ఉండాలి.
- విత్తన కంపెనీ లైసెన్స్ జారీలో వ్యవసాయ శాస్త్రంలో యుజి / పిజి / పిహెచ్.డి చేసిన అభ్యర్థులకు ప్రత్యేక కోటా ఉండాలి
- నూతనంగా ఏర్పాటు చేసిన విత్తన కంపెనీ, స్వపరాగ సంపర్కం జరిగే పంటలలో విత్తన రకం రిజిస్ట్రేషన్‌కు కంపెనీ ఏర్పాటు చేసిన తర్వాత కనీసం 8 నుండి 10 సంవత్సరాల కాల వ్యవధి, అదే హైబ్రిడ్ అయితే కనీసం 3 సంవత్సరాల కాల వ్యవధి ఉండేలా ఒక నిబంధనను చేర్చాలి.

పైన పేర్కొన్న సవరణలను మరియు అధనపు సెక్షన్లను కేంద్రం ప్రతిపాదించిన విత్తన చట్టం ముసాయిదా - 2025లో చేర్చినట్లైతే రైతు ప్రయోజనాలను మరియు విత్తన కంపెనీల అభివృద్ధికి కూడా దోహదం చేస్తుంది. కావున కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఈ విత్తన చట్టం ముసాయిదా - 2025 పై డిసెంబర్ 11, 2025 లోపు ప్రజాభిప్రాయం కోరిన నేపథ్యంలో ప్రతి రైతు ఈ ముసాయిదా చట్టాన్ని (https://agriwelfare.gov.in) వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని, పరిశీలించి పైన వివరించిన సవరణలతోపాటు ఇతర అభిప్రాయాలను jsseeds-agri@gov.in అనే ఈమేయిల్ ఐడి కి పంపగలరని విశ్వవిద్యాలయం రాష్ట్ర రైతాంగాన్ని కోరుతున్నది.